https://teluguislam.net



# అధ్యాయం-5

## 129-148

## 5-అల్లాహ్ ప్రేమ పొందుటకై ముఖ్యమైన మార్గాలు

- దానధర్మాలు చేసేవారిని అల్లాహ్ ప్రేమిస్తాడు మరియు అనుగ్రహిస్తాడు.
- కృతజ్ఞతలు చెల్లించేవారిని అల్లాహ్ ప్రేమిస్తాడు.
- అల్లాహ్‌ను ఎప్పుడు మొరపెట్టుకున్నా ఆలకిస్తాడు.
- ఖుర్ఆన్ పారాయణం చేసేవారిని అల్లాహ్ ప్రేమిస్తాడు.
- అల్లాహ్ నామస్మరణ కారణంగా ప్రేమించబడతారు.

https://teluguislam.net



# 5–అల్లాహ్ ప్రేమ పొందుటకై ముఖ్యమైన మార్గాలు

**దానధర్మాలు చేసేవారిని అల్లాహ్ ప్రేమిస్తాడు మరియు అనుగ్రహిస్తాడు:**

జకాత్ ఫర్జ్ (విధిగావించిన) ధర్మం. దాన్ని నేరవేర్చడం తప్పనిసరి. కాని దాన ధర్మాలు ప్రతి ముస్లిం అల్లాహ్ ప్రీతి పొందుటకై చేసే కార్యం, అదనపు దాన ధర్మాలు. ఇలాంటి దాన ధర్మాలు వలన అల్లాహ్ అనుగ్రహాలతో పాటు, అల్లాహ్ ప్రసన్నత కూడా లభిస్తుంది.

కనుక అల్లాహ్ ఇలా తెలియజేశాడు: అల్లాహ్ ప్రీతి కోసం నిరుపేదలకు, అనాధులకు, ఖైదీలకు అన్నం పెడుతుంటారు. – (పైగా వారిలా అంటారు): 'కేవలం అల్లాహ్ ప్రసన్నత కోసమే మీకు తినిపిస్తున్నాము. అంతేగాని మీనుండి మేము ఎలాంటి ప్రతిఫలాన్నిగానీ, ధన్యవాదాలనుగానీ ఆశించటం లేదు.' [1]

దాన ధర్మాలు చేయడం వలన అతని పాపాలు తుడిచిపోతాయి. కనుక ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా తెలియజేశారు: "దాన ధర్మాలు పాపాలను తుడిచిపెట్టేస్తాయి. ఎలాగైతే నీరు అగ్నిని ఆర్పేస్తుందో." [2]

మరొక హదీసులో ఇలా ఉంది: "రహస్యంగా చేసే ధర్మం అల్లాహ్ కోపాన్ని చల్లబరుస్తుంది." [3]

---

[1] (సూరతుద్ దహ్ర్:8–9).

[2] (సహీహ్ అత్తర్‌గీబ్ వత్తర్‌హీబ్:866, రవాహు అబూయాలా).

[3] (అల్‌మోజముల్ కబీర్, తబ్రానీ, సహీహ్ అత్తర్‌గీబ్ వత్తర్‌హీబ్:888).

https://teluguislam.net



మరియు అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ‘‘మరియు మీరు మంచి మార్గంలో ఖర్చు చేసేది మీ (మేలు) కొరకే. మీరు ఖర్చు చేసేది అల్లాహ్ ప్రీతిని పొందటానికే అయి ఉండాలి. మీరు మంచి మార్గంలో ఏమి ఖర్చు చేసినా, దాని ఫలితం మీకు పూర్తిగా లభిస్తుంది మరియు మీకు ఎలాంటి అన్యాయం జరగదు.’’ [1]

ఇంకా అల్లాహ్ ఇలా తెలియజేశాడు: అల్లాహ్ మార్గంలో తమ ధనాన్ని ఖర్చుచేసినవారి ఉపమానం ఇలా ఉంటుంది: ఒక విత్తనాన్ని నాటగా, అది మొలకెత్తి అందులో నుంచి ఏడు వెన్నులు పుట్టుకు వస్తాయి. ప్రతి వెన్నులోనూ నూరేసి గింజలు ఉంటాయి. ఇదే విధంగా అల్లాహ్ తాను కోరిన వారికి సమృద్ధి వొసుగుతాడు. అల్లాహ్ పుష్కలంగా ప్రసాదించేవాడు. ప్రతిదీ తెలిసినవాడు.’’ [2]

మరియు అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ‘‘ఎవరయితే తమ సిరిసంపదలను రేయింబవళ్లు రహస్యంగానూ, బహిరంగంగానూ ఖర్చు చేస్తారో వారి కొరకు వారి ప్రభువు వద్ద (గొప్ప) పుణ్యఫలం ఉంది. వారికెలాంటి భయంగానీ, దుఃఖంగానీ ఉండదు.’’ [3]

మరొక చోట అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ‘‘అల్లాహ్‌కు మంచి రుణం ఇచ్చేవారు మీలో ఎవరైనా ఉన్నారా? దాన్ని ఆయన ఎన్నో రెట్లు పెంచి తిరిగి ఇస్తాడు. (ఉపాధిని) తగ్గించేవాడు, పెంచేవాడు అల్లాహ్‌యే. కడకు మీరంతా మరలి పోవలసింది ఆయన వద్దకే.’’ [4]

---

[1] (సూరతుల్ బఖరా: 272).
[2] (సూరతుల్ బఖరా:261).
[3] (సూరతుల్ బఖరా: 274).
[4] (సూరతుల్ బఖరా: 245).

https://teluguislam.net



హ్రజత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కథనం ప్రకారం; ప్రవక్త ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:

అల్లాహ్ హలాల్ (పవిత్ర) సంపాదన మాత్రమే స్వీకరిస్తాడు. అంచేత ఎవరైనా తమ పవిత్ర సంపాదనలో నుండి ఒక ఖర్జూరపుటంత ధనం దానం చేసినా అల్లాహ్ దాన్ని తన కుడిచేత్తో అందుకుంటాడు. ఆ తరువాత దాన్ని మీరు గుర్రపు పిల్లను పెంచి పెద్దచేసినట్లుగా దానం చేసినవాడి కోసం (అతని పుణ్యాన్ని) పెంచుతాడు. అలా పెరుగుతూ చివరకూ అది పర్వతమంత పెద్దదిగా అయిపోతుంది.'' [1]

హ్రజత్ ఆయిషా (రజియల్లాహు అన్హు) కథనం ప్రకారం; కొంత మంది ఒక మేకను కోసారు. (దాని మాంసంలో చాలా భాగం ప్రజలకు పంచి పెట్టారు). ఆ సందర్భంగా ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఆయిషా (రజి) తో మాట్లాడుతూ: 'ఆ మాంసంలో ఇంకా ఎంత మిగిలి ఉంది?' అని అడిగారు.

'అంతా అయిపోయింది, ఒక్క బుజం మాత్రమే మిగిలి ఉంది' అని చెప్పారామె.

దానికాయన: '(కాదు, కాదు) ఆ భుజం తప్ప మాంసమంతా (ధర్మం చేసిన మాసం దానం రూపంలో) మిగిలే ఉంది' అని అన్నారు. [2]

ఈ హదీసు భావం ఏమిటంటే, మేకను కోసిన వాళ్ళు ఒక భుజాన్ని మాత్రం ఉంచుకొని మిగతా మాంసమంతా దానం చేశారు. దానం చేసిన మాంసానికి పరలోకంలో ప్రతిఫలం లభిస్తుంది కాబట్టి అది మిగిలే ఉంది.

---

[1] (బుఖారీ:1321, ముస్లిం:1685).

[2] (సహీహ్ తిర్మిజీ:2470).

https://teluguislam.net



హజ్రత్ అదీ బిన్ హాతిమ్ (రజియల్లాహు అన్హు) కథనం ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ఉపదేశించారు:
''ఒక ఖర్జూరపండు ముక్కను దానం చేసైనా సరే మిమ్మల్ని మీరు నరకాగ్ని బారి నుండి కాపాడుకోండి.'' [1]

## కృతజ్ఞతలు చెల్లించేవారిని అల్లాహ్ ప్రేమిస్తాడు:

మనిషి కృతజ్ఞతా భావం కలిగి ఉండాలి. అది మనిషి స్వయానికే లాభం చేకూరుస్తుంది. మరియు కృతజ్ఞతా భావం కలిగిఉన్న దాసులను అల్లాహ్ అమితంగా ప్రేమిస్తాడు. మరియు కృతఘ్నతా ధోరణి కలవారిని అల్లాహ్ ఇష్టపడడు. కనుక అల్లాహ్ ఇలా తెలియజేశాడు:

''ఒకవేళ మీరు తిరస్కార వైఖరిని అవలభించినట్లయితే అల్లాహ్‌కు మీ అవసరం ఎంత మాత్రం లేదు (అన్న విషయాన్ని తెలుసుకోండి). తన దాసులు కృతఘ్నతా ధోరణిని ఆయన ఇష్టపడడు. మీరు గనక కృతజ్ఞతా పూర్వకంగా మసలుకుంటే, దాన్ని ఆయన మీ కోసం ఇష్టపడుతాడు…'' [2]

హజ్రత్ నూహ్ అలైహిస్సలామ్ మరియు ఇబ్రాహీమ్ అలైహిస్సలామ్, హజ్రత్ మూసా అలైహిస్సలామ్ మరియు ప్రతి ప్రవక్త అల్లాహ్ పట్ల కృతజ్ఞతా ధోరణితోనే మసులుకున్నారనీ ఖుర్ఆన్ అనేక ఆయతుల ద్వారా స్పష్టమవుతుంది.

హజ్రత్ ముజాహిద్ (రజియల్లాహు అన్హు) గారు: ''ఆయన (నూహ్ అలైహిస్సలామ్) మాత్రం కృతజ్ఞత పూర్వకంగా మెలిగిన మా దాసుడు.'' [3]

---

[1] (బుఖారీ:3328).
[2] (సూరతుజ్ జుమర్: 7).
[3] (బనీ ఇస్రాయీల్:3).

https://teluguislam.net



ఈ ఆయతు గురించి ఇలా వాఖ్యానించారు: ‘‘ఆయన ఏదైన తింటే మరియు త్రాగితే (కృతజ్ఞతా భావంతో) **‘అల్‌హమ్దు లిల్లాహ్‌’** అని స్తుతించేవారు. అందుకని అల్లాహ్‌ ఆయన గురించి కృతజ్ఞతా భావంతో మెలిగిన దాసుడని అల్లాహ్‌ తెలియజేశాడు.’’[1]

మరియు హజ్రత్‌ ఇబ్ను మాలిక్‌ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్‌ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:

‘‘నిశ్చయంగా అల్లాహ్‌ ఆ దాసుని పట్ల చాలా సంతోషిస్తాడు. ఏ దాసుడయితే ఆహారం తినిన తరువాత అల్లాహ్‌ను (కృతజ్ఞతా భావంతో **‘అల్‌హమ్దు లిల్లాహ్‌’** అని) స్తుతిస్తాడో, లేక ఏమైనా పానీయాన్ని త్రాగిన తరువాత అల్లాహ్‌ను **(‘అల్‌హమ్దు లిల్లాహ్‌’** అని) స్తుతిస్తాడో.’’ [2]

ప్రవక్త ముహమ్మద్‌ (సల్లల్లాహు అలైహి వసల్లం) గారి గురించి హదీసు గ్రంథంలో ఇలా ఉంది. హజ్రత్‌ ఆయిషా (రజియల్లాహు అన్హు) కథనం: ప్రవక్త ముహమ్మద్‌ (సల్లల్లాహు అలైహి వసల్లం) రాత్రిపూట నిలబడి నమాజు చేసేవారు. దాని మూలంగా ఆయన పాదాలపై వాపు కూడా వచ్చేది.

**అది చూసి నేను: యా రసూలల్లాహ్‌!** ‘మీకు ఇంత శ్రమదేనికీ? **మీ పూర్వపరాల పాపాలన్నిటిని అల్లాహ్‌ మన్నించేశాడు కదా?’** అని అన్నాను.

**దానికాయన(స):** ‘నేను అల్లాహ్‌కు కృతజ్ఞుడైన దాసుణ్ణి కాకూడదా?’ అని అన్నారు.[3]

---

[1] (తఫ్సీర్‌ తబ్రీ:17/354 తఫ్సీర్‌ ఇబ్ను కసీర్‌:5/46)

[2] (ముస్లిం:4915).

[3] (బుఖారీ:4459, ముస్లిం:5044).

https://teluguislam.net



కనుక హజ్రత్ అబూ బక్రా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) వద్దకు ఏదైన సంతోషకరమైన విషయం కలిగిందంటే, లేక సంతోషకరమైన వార్త తెలిసిందంటే అల్లాహ్ ముందు కృతజ్ఞతా భావంతో సజ్దా (సాష్టాంగం) చేసేవారు.[1]

మరియు అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ‘‘ఇంకా నీ ప్రభువు అనుగ్రహాలను గురించి పొగుడతూ ఉండు.’’[2]

అంటే కృతజ్ఞతా వైఖరి ద్వారా ఈ అనుగ్రహాలను వ్యక్త పరచడం, మెచ్చుకోలుగా చెప్పు కోవటం దైవానికి ఇష్టకరమైనది.

మరియు హజ్రత్ అబూ యహ్యా సుహైబ్ బిన్ సినాన్ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ‘‘విశ్వాసి వ్యవహారం చాలా విచిత్రంగా ఉంటుంది. అతను చేసే ప్రతి పనిలో అతని కొరకు మేలు ఉంటుంది. విశ్వాసికి తప్ప మరెవరికీ ఈ భాగ్యం ప్రాప్తించలేదు. అతనికి ఆనంద ఘడియలు ఎదురైతే అందుకు అతను అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలుపుకుంటాడు. ఈ కృతజ్ఞత వల్ల అతనికే మేలు కలుగుతుంది. (దాని కారణంగా అతనికి పుణ్యం లభిస్తుంది) ఒక వేళ అతనికి కష్టాలు ఎదురైతే అతను సహనం వహిస్తాడు, ఈ సహనం కూడా అతనికి మేలే కలుగజేస్తుంది.’’[3]

అల్లాహ్ చేసిన మేళ్లను ఎన్నటికి మరవకూడదు. మనిషి కృతజ్ఞతా పూర్వకంగా మసులుకోవాలి. కృతజ్ఞత భావం వల్ల అతని అనుగ్రహాలలో

---

[1] (సహీహ్ అబూదావూద్: 2774).
[2] (సూరతుజ్ జుహా:11).
[3] (ముస్లిం:5318).

https://teluguislam.net



శుభాలు కలుగుతాయి. మరియు అతనికి మరిన్ని కానుకలు ప్రసాదించబడుతాయి. కనుక అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ‘‘మీరు గనక కృతజ్ఞులుగా మెలిగితే, నేను మీకు మరింత అధికంగా అనుగ్రహిస్తాను.’’ [1]

మరియు హజ్రత్ నౌమాన్ బిన్ బషీర్ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:

‘‘ఎవరైతే స్వల్పమైన వాటి (విషయాల)పై కృతజ్ఞతలు తెలుపరో, వారు అధికమైన వాటి(విషయాల)పై కూడా కృతజ్ఞతలు తెలుపలేరు.

మరియు ఎవరైతే ప్రజలకు కృతజ్ఞతలు తెలుపరో, వారు అల్లాహ్‌కు కూడా కృతజ్ఞతలు తెలుపలేరు.

అల్లాహ్ అనుగ్రహాల పట్ల మీరు (గొప్పగా) చెప్పుకుంటే కృతజ్ఞులు అవుతారు. ఆలా చేయని పక్షంలో కృతఘ్నులు అవుతారు.

కలసికట్టుగా ఉండటం (అల్లాహ్)కారుణ్యమవుతుంది. మరియు తెగలుగా చీలిపోవడం (అల్లాహ్) శిక్ష అవుతుంది.’’[2]

మురియు హజ్రత్ సులైమాన్ (అలైహిస్సలామ్) గారు ఇలా ప్రర్థించేవారు: ‘‘నా ప్రభూ! నువ్వు నాకు, నా తల్లిదండ్రులకూ ప్రసాదించిన అనుగ్రహాలకు గాను నిత్యం నీకు కృతజ్ఞతలు తెలుపుకునే సద్బుద్ధిని నాకు ఇవ్వు. నేను నీ మెప్పును పొందే మంచిపనులు చేసేలా చూడూ. నీ దయతో నన్ను నీ సజ్జన దాసులలో చేర్చుకో.’’ [3]

---

[1] (సూరతు ఇబ్రాహీమ్:7).

[2] (జవాయిద్ ముస్నద్ అహ్మద్, సహీహ్ అత్తర్గీబ్ వత్తర్హీబ్: 976).

[3] (సూరతున్ నమ్ల్:19).

https://teluguislam.net



హ[జత్ ముఆజ్ (రజియల్లాహు అన్హు) కథనం ప్రకారం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఒక సారి నా చెయ్యి పట్టుకొని ఇలా అన్నారు:

**ఓ ముఆజ్!** అల్లాహ్ సాక్షిగా! 'నేను నిన్ను అభిమానిస్తున్నాను' మరియు నేను నీకు 'వసీయత్' చేస్తున్నాను, నీవు ప్రతి నమాజు తరువాత: **'అల్లాహుమ్మ అయిన్నీ అలా జిక్రిక, వ షుక్రిక, వ హుస్ని ఇబాదతిక్'** (యా అల్లాహ్! నేను నీ దాస్యం చేయటానికి, నీకు కృతజ్ఞతలు తెలుపుకోవటానికి, తగు రీతిలో నిన్ను ఆరాధించటానికి, నాకు సహాయం చెయ్యి) అని చదువు.[1]

అల్లాహ్ మానవుల కొరకు అంతులేని అనుగ్రహాలను ప్రసాదించాడు. అల్లాహ్ ప్రసాదించిన ఏ ఏ అనుగ్రహాలను లెక్కించగలుగుతారు? మనుషుల కొరకు భూమండలాన్ని సృష్టించి అతి అనుకూలమైన జీవన అభివృద్ధిని ప్రసాదించాడు. భూమ్యాకాశాల మధ్యలో అనేక వస్తువులను సృష్టించి మనిషికి అనుకూలంగా మల్చాడు. ఆకాశంలో సూర్యచంద్ర, నక్షత్ర గ్రహాలను సృష్టించి రెయింబవళ్ళను చేశాడు. భూమిలో తియ్యటి మరియు ఉప్పు నీటి జలాలను మరియు ఖనిజాలను సృష్టించి మనిషికి అనుగ్రహించాడు. మానవ శరీరంలో ఉన్న అవయువాలను అతి గొప్ప విధానంలో సృష్టించి మనిషికి గౌరవించాడు. మరియు ప్రతి యుగంలో మానవుల కొరకు ప్రవక్తలను, గ్రంథాలను ప్రసాదించి రుజు మార్గాన్ని చూపాడు. అల్లాహ్ మనిషి కొరకు ప్రసాదించిన ఏ ఏ అనుగ్రహాన్ని లెక్క పెట్ట గలరు. కనుక అల్లాహ్ ఇలా తెలియజేశాడు: **'మరి మీరు మీ ప్రభువు యొక్క ఏ అనుగ్రహాలను తిరస్కరిస్తారు'** కావాలంటే మీరు ఖుర్ఆన్ గ్రంథంలో **'రహ్మాన్‌సూరా'**ను చదవండి.

---

[1] (సహీహ్ అబూదావూద్: 1522).

https://teluguislam.net



## అల్లాహ్‌ను ఎప్పుడు మొరపెట్టుకున్నా ఆలకిస్తాడు:

మనిషి తన దాస్యం కారణంగా అల్లాహ్‌కు దగ్గరవుతాడు. మరియు అల్లాహ్ అతన్ని ప్రేమిస్తాడు. అందుకని ప్రార్థన కూడా ఒక రకమైన ఆరాధనే. పైగా ఆరాధనకు ప్రాణం, సారం ప్రార్థనే. కనుక ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా తెలియజేశారు: **'దుఆ ఆరాధన యొక్క సారం'** [1]

దాసుడు అల్లాహ్‌ను మొరపెట్టుకుంటే అతని మొరను తిరస్కరించడు. పైగా అల్లాహ్ అతన్ని ప్రేమిస్తూ అతని మొరను కూడా ఆలకిస్తాడు. అల్లాహ్ మా విన్నపాలు అంగీకరించుటకై మాకు అతి దగ్గరలో ఉన్నాడు మరియు మా దుఆలను ఆమోదిస్తాననీ ఖుర్ఆన్ గ్రథంలో అనేక చోట్ల తెలియజేశాడు. కనుక సూరతుల్ బఖరా: 186వ ఆయతులో అల్లాహ్ ఇలా తెలియజేశాడు:

''(ఓ ప్రవక్తా!) నా దాసులు నా గురించి నిన్ను అడిగితే, నేను (వారికి) అతి సమీపంలోనే ఉన్నాననీ, పిలిచేవాడు నన్ను ఎప్పుడు పిలిచినా నేను అతని పిలుపును ఆలకించి ఆమోదిస్తానని (నువ్వు వారికి చెప్పు)''

మరియు అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''మరియు ఆయన సజీవుడు. ఆయన తప్ప మరో ఆరాధ్యుడు లేడు. కాబట్టి మీరు స్వచ్ఛమైన ఆరాధనను ఆయనకే సమర్పిస్తూ ఆయన్నే వేడుకొండి....'' [2]

హ|జత్ సల్మాన్ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''నిశ్చయంగా మీ ప్రభువు

---

[1] (సహీహ్ తిర్మిజీ:2969).

[2] (సూరతుల్ మూమిన్: 65).

https://teluguislam.net



సజీవుడు, గొప్ప ఉదాత్తుడు. అల్లాహ్‌ను మొరపెట్టుకుంటూ రెండు చేతులు పైకెత్తిన దాసునికి ఏమియు ప్రసాదించకుండా (మొరను)రద్దు చేయటాన్ని (అల్లాహ్) సిగ్గు చెందుతాడు.'' [1]

హజ్రత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు)కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''మీరు అల్లాహ్‌ను మొరపెట్టుకొండి! ఆయన (మీ దుఆను) తప్పక స్వీకరిస్తాడనే నమ్మకంతో. మీరు తెలుసుకోండి! ఏకాగ్రత లేని మరియు నిర్లక్ష్య హృదయంతో చేసే దుఆలు ఆమోదించబడవు.'' [2]

హజ్రత్ అబూ సయీద్ అల్ ఖుద్రీ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ముస్లింగా ఉండే ఏ వ్యక్తి అయినా అతను మొరపెట్టుకునే దుఆ గనక తప్పుడు పనికి కాకుండా మరియు రక్త సంభందాల తెగతెంపులకు కాకుండా ఉంటే, ఆ దుఆ మూడు విధాలలో ఏదోఒక్క విధానంలో తప్పక స్వీకరించ బడుతోంది. ''అతని దుఆ (అప్పుడే) ఆలకించబడుతుంది. లేదా; ఆ దుఆ కారణంగా పరలోకంలో (పుణ్యాలు) సమకూర్చటం జరుగుతుంది.

లేదా; చేసిన దుఆకు సమానంగా అతనికి (రాబోయే) చెడును దూరం చేయడం జరుగుతుంది....'' [3]

మనిషికి ఏ బాధ, దుఃఖం వచ్చినా, ఏ కష్టం, నష్టం కలిగినా అల్లాహ్‌నే వేడుకుంటూ ఉండాలి. సంతోషాల కొరకు మరియు లాభాల కొరకు

---

[1] (సహీహ్ అబూదావూద్:1488).

[2] (సహీహ్ తిర్మిజీ: 3479).

[3] (అహ్మద్: 10709, సహీహ్ అత్తర్గీబ్ వత్తర్హీబ్: 1633).

https://teluguislam.net



అల్లాహ్‌నే ప్రార్థించాలి. సంతాన ప్రాప్తి కొరకు మరియు మగ పిల్లలు, ఆడ పిల్లలు కావాలన్నా అల్లాహ్‌నే వేడుకోవాలి. అతి పెద్ద అవసరమైనా లేక అతి చిన్న అవసరమైనా అల్లాహ్‌తోనే సహాయం కోరాలి.

వేడుకోవడం అల్లాహ్ ఆరాధనేననీ అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''నన్ను ప్రార్థించండి నేను మీ ప్రార్థనలను అంగీకరిస్తాను. గర్వానికి లోనై నా ఆరాధనకు విముఖులయ్యేవారు తప్పని సరిగా అవమానానికి గురై నరకములో ప్రవేశిస్తారు.'' [1]

మరియు అల్లాహ్‌తో పాటు ఇతరులెవ్వరినీ మొరపెట్టుకోకూడదని అల్లాహ్ ఇలా హెచ్చరించాడు: ''నిశ్చయంగా మసీదులు అల్లాహ్ కొరకే ప్రత్యేకించబడ్డాయి. కనుక వాటిలో అల్లాహ్‌తో పాటు ఇతరులెవ్వరనీ పిలవకండి.'' [2]

ఇంకా అల్లాహ్ ఈ విధంగా తెలియజేశాడు: ''ఎవడైనా, తన దగ్గర ఏ ప్రమాణమూ లేకపోయినప్పటికీ – అల్లాహ్‌తో పాటు వేరొక దేవుణ్ణి మొరపెట్టుకుంటే, అటువంటి వ్యక్తి లెక్క అతని ప్రభువు వద్ద ఉన్నది. నిశ్చయంగా అవిశ్వాసులు సఫలురు కాలేరు.'' [3]

మరియు హ॒జ్రత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:
''ఎవరైతే అల్లాహ్‌ను ప్రార్థించరో (దుఆ చేయరో) అలాంటివారితో అల్లాహ్ కోపగించుకుంటాడు.'' [4]

---

[1] (సూరతుల్ మూమిన్: 60).
[2] (సూరతుల్ జిన్:18).
[3] (సూరతుల్ మూమినూన్: 117).
[4] (సహీహ్ ఇబ్నుమాజా: 3827).

https://teluguislam.net



## ఖుర్‌ఆన్ పారాయణం చేసేవారిని అల్లాహ్ ప్రేమిస్తాడు:

అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ‘‘నమాజు నెలకోల్పు – సూర్యుడు నెత్తి నుండి వాలినప్పటి నుండి రాత్రి చీకటి అలుముకునే వరకు. తెల్లవారు జామున ఖుర్‌ఆన్ పారాయణం చెయ్యి. నిశ్చయంగా తెల్లవారు జామున చేసే ఖుర్‌ఆన్ పారాయణానికి సాక్ష్యం ఇవ్వబడుతుంది. – రాత్రిపూట కొంత భాగం తహజ్జుద్ (నమాజు)లో ఖుర్‌ఆన్ పఠనం చెయ్యి. ఇది నీ కొరకు అదనం. త్వరలోనే నీ ప్రభువు నిన్ను **‘మఖామె మహ్మూద్’** కు (ప్రశంసనీయమైన స్థానానికి) చేరుస్తాడు.’’[1]

హజ్రత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ‘‘నిశ్చయంగా తెల్లవారు జామున చేసే ఖుర్‌ఆన్ పారాయణానికి సాక్ష్యం ఇవ్వబడుతుంది’’ అంటే ‘ఫజ్ర్ వేళ’ అల్లాహ్ దూతలు దివి నుండి భువికి దిగివస్తారు.[2]

మరో హదీసులో ఇలా ఉంది: ‘రాత్రి వేళ విధుల్ని నిర్వహించిన దూతలు అల్లాహ్ సన్నిధికి చేరుకున్నపుడు – తనకంతా తెలిసినప్పటికీ – మీరు నా దాసుల్ని ఏ స్థితిలో వదలి వచ్చారు?’ అని అల్లాహ్ ప్రశ్నిస్తాడు. దానికి వారు: ‘మేము వారి వద్దకు వెళ్ళినప్పుడు కూడా వారు నమాజులో లీనమై ఉన్నారు. మేము వారివద్ద నుంచి తిరిగి వస్తున్నప్పుడు కూడా వారు నమాజులోనే నిమగ్నులై ఉన్నారు’ అని సమాధానమిస్తారు.[3]

---

[1] (సూరతు బనీ ఇస్రాయీల్: 78–79).
[2] (సహీహ్ తిర్మిజీ: 3135, సహీహ్ ఇబ్నుమాజా:670).
[3] (బుఖారీ:522, ముస్లిం:1001).

https://teluguislam.net



హజ్రత్ అనస్ (రజియల్లాహు అన్హు) కథనం: 'ప్రజలలో కొంత మంది అల్లాహ్‌కు అతి దగ్గరవారై ఉండారు.' అని ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) అన్నారు.

యా రసూలల్లాహ్! 'వారెవరూ?' అని కొందరు అడిగారు.

దానికి ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం): 'వారు అహ్‌లుల్ ఖుర్‌ఆన్, (ఖుర్‌ఆన్ గ్రంథాన్ని పారాయణం చేసేవారు, దానిని నేర్పేవారు, నేర్చుకునేవారు) మరియు వారే అల్లాహ్‌కు అతి దగ్గరవారై ఉంటారు, వారు ఆయనకు ప్రత్యేకులు' అని అన్నారు. [1]

హజ్రత్ ఉస్మాన్ బిన్ అఫ్ఫాన్ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:

''మీలో ఖుర్‌ఆన్ నేర్చుకొని ఇతరులకు నేర్పించినవారే అందరికంటే ఎక్కువగా మేళ్లు కలిగి ఉన్నవారు.'' [2]

హజ్రత్ ఉమర్ బిన్ ఖత్తాబ్ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:

''నిశ్చయంగా అల్లాహ్ ఈ గ్రంథం కారణంగా కొన్ని జాతుల్ని ఉన్నతమైన స్థితికి పెంచుతాడు. మరికొన్ని జాతుల్ని దీని కారణంగానే అధోగతికి దిగజార్చుతాడు.'' [3]

ప్రవక్త ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వసల్లం) ఈ విధంగా ప్రవచిస్తుండగా తాను విన్నానని హజ్రత్ అబూహురైరా (రజియల్లాహు అన్హు) తెలియజేశారు:

---

[1] (నసాయి, ఇబ్ను మాజా, హాకిమ్: సహీహ్ అత్తర్గీబ్ వత్తర్హీబ్: 1432).

[2] (బుఖారీ:4639).

[3] (ముస్లిం:1353).

https://teluguislam.net



“సుమధుర స్వరంతో గొంతెత్తి ఖుర్‌ఆన్ పారాయణం చేసే దైవప్రవక్త కంఠ శ్వరాన్ని శ్రద్ధగా ఆలకించినట్లుగా అల్లాహ్ మరే స్వరాన్నీ ఆలకించడు.”[1]

సమధుర స్వరంతో ఖుర్‌ఆన్ పారాయణం చేసేవాని పట్ల అల్లాహ్ ప్రసన్నుడయి అతని ఆచరణను అంగీకరిస్తాడు అని అర్థం.

హ్రజత్ అనస్ (రజియల్లాహు అన్హు) కథనం: అన్సార్ జాతికి చెందిన ఒక సహాబీ(అనుచరుడు) మస్జిద్ ఖుబాలో ఇమామత్ చేసేవారు.

ఆయన ప్రతి రకాతు ఆరంభంలో **‘ఖుల్‌హువల్లాహు అహద్’** సూరా పఠించిన తరువాత మరొక సూరా చదివేవారు. ఇలాగే ఆయన ప్రతి రకాతులో చేసేవారు.

కొందరు ఆయనను ఇలా అడిగారు? ‘నీవు ఆ సూరాను నమాజులో చదవకుంటే నమాజు కానట్టుగా ప్రతి రకాతులో నిత్యం చదువుతుంటావు, నీవు చదివేటుగా ఉంటే ఆ సూరను మాత్రమే చదువు లేకుంటే ఇతర సూరాలను చదువు’ అని అన్నారు.

తరువాత ఆయన ఇలా సమాధానమిచ్చారు: ‘చూడండి! నేను ఇలాగే నమాజు చదువుతాను మీకిష్టమైతే నేను మీ కొరకు ఇమామత్ చేస్తాను, మీకు ఇష్టం లేదంటే చెప్పండి ఇమామత్ మానుకుంటాను’ అని అన్నారు.

వారిలో అందరికంటే గొప్ప వ్యక్తిగా ఆయనను వారు భావించేవారు. కనుక ఇతరులు ఇమామత్ చేయడం వారికి ఇష్టముండేది కాదు.

---

[1] (బుఖారీ:4636, ముస్లిం:1319).

https://teluguislam.net



చివరికి కొంత మంది ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం)వద్దకు పోయి ఈ సమస్య గురించి తెలియజేశారు.

తరువాత ప్రవక్త ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వసల్లం) ఆ వ్యక్తితో:

'వారి కోరిక ప్రకారం (ఇమామత్) చేయుటకై నీకు ఏ విషయం అడ్డు? ఆ సూరానే నీవు ఎందుకు ప్రతి రకాతులో చదవాలనుకుంటున్నావు?' అని అడిగారు.

దానికి ఆ వ్యక్తి: యా రసూలల్లాహ్! 'నేను ఆ సూరా **(ఖులహువల్లాహు అహద్)** ను ఇష్టపడుతున్నాను' అని అన్నారు.

అది విని ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) అతనితో: 'ఆ సూరాను నీవు ఇష్టపడుతున్నావంటే అది నీన్ను స్వర్గానికి తీసుకెళ్తుంది' అని చెప్పారు. [1]

హజ్రత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:

''ఖుర్ఆన్‌లో ముప్ఫై వాక్యాలు గల, ఒక సూరా ఉంది. అది (అల్లాహ్ సన్నిధిలో) ఒక వ్యక్తి గురించి సిఫారసు చేసి ఆఖరికి అతనికి క్షమాభిక్ష లభించేలా చేసింది.'' అదే, 'తబారకల్లిజీ బియదిహిల్ ముల్కు.'[2]

మరియు ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''దివ్య ఖుర్ఆన్‌లో ఒక సూరా ఉంది. అది తనను పఠించేవాని తరఫున వాదిస్తుంది. కడకు అతన్ని స్వర్గంలో చేర్పిస్తుంది.'' (మజ్మవుజ్ జవాయిద్).

---

[1] (సహీహ్ తిర్మిజీ:2901).

[2] (తిర్మిజీ: 2891, ఇబ్నుమాజా: 3786, అబూదావూద్).

https://teluguislam.net



హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ మస్‌వూద్ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: 'తబారకల్లజీ బియదిహిల్ ముల్క్' ప్రతి రాత్రి చదివిన కారణంగా అల్లాహ్ వారిని సమాధి శిక్షనుండి కాపాడుతాడు.' [1]

హజ్రత్ జాబిర్(రజియల్లాహు అన్హు) కథనం ప్రకారం: ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం): ''అలిఫ్ లామ్ మీమ్ తన్జీల్ అస్‌సజ్దా' మరియు 'తబారకల్లజీ' సూరాలు పారాయణం చేసేవరకు నిద్రపోయేవారు కాదు.'' అని తెలిపారు. [2]

హజ్రత్ ఆయిషా (రజియల్లాహు అన్హు) కథనం ప్రకారం: ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం): ''సూరతుజ్ జుమర్' మరియు 'బనీ ఇస్రాయీల్' సూరాలు పారాయణం చేసేవరకు నిద్రపోయేవారు కాదు.'' అని తెలిపారు. [3]

హజ్రత్ అబ్దుల్లాహ్ ఇబ్ను మస్‌వూద్ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''ఎవరైనా ఖుర్ఆన్ గ్రంథంలోని ఒక అక్షరాన్ని చదివితే అతనికి ఒక పుణ్యం లభిస్తుంది. ఆ ఒక్క పుణ్యం పది పుణ్యాలకు సమానంగా ఉంటుంది.'' **నా అభిప్రాయం ప్రకారం: 'అలిఫ్ లామ్ మీమ్'** అనేది ఒకే అక్షరం కాదు. పైగా 'అలిఫ్' ఒక అక్షరం, 'లామ్' ఒక అక్షరం, మీమ్' ఒక అక్షరం' అని అన్నారు. [4]

---

[1] (హాకిమ్, సహీహ్ తర్గీబ్ వత్ తర్హీబ్: 1589).
[2] (సహీహ్ తిర్మిజీ: 2892).
[3] (సహీహ్ తిర్మిజీ: 2892).
[4] (సహీహ్ తిర్మిజీ: 2910, సహీహ్ నసాయి: 2391, హాకిమ్).

https://teluguislam.net



## అల్లాహ్ నామస్మరణ కారణంగా ప్రేమించబడతారు:

అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''ఓ విశ్వాసులారా! అల్లాహ్‌ను అత్యధికంగా స్మరించండి.– ఉదయం సాయంకాలం ఆయన పవిత్రతను కొనియాడండి.– మీపై తన కారుణ్య అనుగ్రహాలను పంపేవాడు ఆయనే. ఇంకా ఆయన దూతలు కూడా (మీపై కారుణ్యం కురవాలని ప్రార్థిస్తారు) – ఆయన మిమ్మల్ని చీకట్ల నుంచి వెలికితీసి వెలుగు వైపుకు తీసుకు వచ్చేటందుకు! అల్లాహ్ విశ్వాసుల పాలిట అపార కరుణామయుడు.''[1]

మరోకచోట అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''అల్లాహ్‌ను అత్యధికంగా స్మరించే పురుషులు–స్మరించే స్త్రీలు–వీరందరి కోసం అల్లాహ్ (విస్తృతమైన) మన్నింపును, గొప్ప పుణ్యఫలాన్ని సిద్ధం చేసి ఉంచాడు.''[2]

హజ్రత్ సముర బిన్ జున్దుబ్ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''అల్లాహ్ వద్ద నాలుగు వచనాలు అన్నిటికంటే ప్రియమైనవి: **''సుబ్‌హానల్లాహి, వల్ హమ్దులిల్లాహి, వలా ఇలాహ ఇల్లల్లాహు, వల్లాహు అక్బర్**...''[3]

హజ్రత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: **''సుబ్‌హానల్లాహి, వల్ హమ్దులిల్లాహి, వలా ఇలాహ ఇల్లల్లాహు, వల్లాహు అక్బర్''** అని పలకటం నాకు సూర్యుడు ఉదయించే (ప్రపంచంలోని) వస్తువులన్నిటికంటే ప్రియమైనది.''[4]

---

[1] (సూరతుల్ అహ్‌జాబ్: 41–43).
[2] (సూరతుల్ ఆహ్‌జాబ్: 35).
[3] (ముస్లిం:3985).
[4] (ముస్లిం:4861).

https://teluguislam.net



హజ్రత్ అబూ జర్ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) నాతో ఇలా అన్నారు: అల్లాహ్ వద్ద అత్యంత ప్రియమైన పలుకు ఏదో నీకు తెల్పనా? అల్లాహ్ వద్ద అత్యంత ప్రియమైన పలుకు **''సుబ్‌హానల్లాహి వబిహమ్దిహీ.''** [1]

ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ప్రవచించగా హజ్రత్ జాబిర్ (రజియల్లాహు అన్హు) విన్నారని ఇలా తెలియజేశారు: అల్లాహ్ వద్ద అన్నిటికంటే శ్రేష్ఠమైన **'జిక్ర్'** (స్మరణ) **'' లా ఇలాహ ఇల్లల్లాహు''** మరియు అన్నిటికంటే గొప్ప **'షుక్ర్'** (కృతజ్ఞత) **''అల్ హమ్దులిల్లాహ్''** అని పలకడం. [2]

హజ్రత్ జాబిర్ (రజియల్లాహు అన్హు)కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''ఎవరయితే **'సుబ్హానల్లాహి వ బిహమ్దిహి'** అని అంటారో, వారి కోసం స్వర్గంలో ఒక ఖర్జూరపు చెట్టు నాటడం జరుగుతుంది.'' [3]

హజ్రత్ అబూ మూసా అష్అరీ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) నాతో: 'నేను నీకు స్వర్గ నిధుల్లోని ఒక నిధి గురించి తెలుపనా?' అని అన్నారు.

నేను (రజి): యా రసూలల్లాహ్!'తప్పకుండా తెలుపండి' అని అన్నాను. అందుకాయన(స): **'లాహౌల వలా ఖువ్వత ఇల్లా బిల్లాహ్'** అని చెప్పారు. [4]

---

[1] (ముస్లిం:4911).

[2] (సహీహ్ ఇబ్ను హిబ్బాన్: 2326, సిల్‌సిలతుస్ సహీహా: 1528).

[3] (సహీహ్ తిర్మిజీ 3464).

[4] (బుఖారీ:3883, ముస్లిం:4875).

https://teluguislam.net



హజ్రత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: రెండు వచనాలు నాలికపై చాలా తేలికపైనవి, త్రాసులో చాలా బరువైనవి, మరియు కరుణామయునికి చాలా ప్రియమైనవి, అవి:

**''సుబ్హానల్లాహి వబిహమ్దిహి, సుబ్హానల్లాహిల్ అజీమ్.''** [1]

హజ్రత్ అబూ మాలిక్ అష్అరీ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:

''పరిశుభ్రత సగం విశ్వాసం (ఈమాన్). **'అల్‌హమ్దు లిల్లాహ్'** త్రాసుని నింపేస్తుంది. **'సుబ్‌హానల్లాహి, అల్‌హమ్దు లిల్లాహి,** అనే పలుకులు త్రాసుని నింపేస్తాయి లేక భూమ్యాకాశాల మధ్య ఉన్నదాన్ని (ఖాళీ స్థలం సమానంగా పుణ్యాలతో) నింపేస్తాయి.'' [2]

హజ్రత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం): **'ముఫర్రిదూన్‌లు మించిపోయారు'** అని అన్నారు.

ఆ మాట విని సహచరులు: యా రసూలల్లాహ్! **'ముఫర్రిదీన్‌లు అంటే ఎవరు?'** అని అడిగారు.

అందుకు ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం): **'అల్లాహ్‌ను అత్యధికంగా స్మరించే స్త్రీ, పురుషులు'** అని అన్నారు. [3]

---

[1] (బుఖారీ:5927, ముస్లిం:4860).
[2] (ముస్లిం:328).
[3] (ముస్లిం: 4834).

https://teluguislam.net



హజ్రత్ ఇబ్ను మస్‌వూద్ కథనం: ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: నాకు మేరాజ్ యాత్ర చేయించబడిన రాత్రి నేను ఇబ్రాహీమ్ (అలైహిస్సలామ్) గారిని కలిసాను.

అప్పుడాయన నాతో: 'ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం)! మీ అనుచర సమాజానికి నా తరఫున సలాం చెప్పండి.' **ఇంకా వారికి ఇలా తెలుపండి:** 'స్వర్గంలోని మట్టి శుద్ధమైనది, అక్కడి నీళ్ళు తీయగా ఉంటాయి, అదో చదును మైదానం.

మరియు **'సుబ్‌హానల్లాహి వల్ హమ్దు లిల్లాహి, వలా ఇలాహ ఇలల్లాహు'** అని అంటే అక్కడ ఒక చెట్టుని నాటుకున్నట్లే' అని అన్నారు.[1]

హజ్రత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:

**'సుబ్‌హానల్లాహి వబిహమ్దిహి'** అని రోజుకు వందసార్లు స్మరించినట్లయితే సముద్రంలో నురుగుకు సమానమైన పాపాలైన సరే క్షమించబడతాయి'' [2]

---

[1] (సహీహ్ తిర్మిజీ:3462).

[2] (సహీహ్ తర్మిజీ: 3466, సహీహ్ ఇబ్ను మాజా: 3812).